21082024-DIS-04_Layout 1 8/21/2024 2:13 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

విగ్రహ రాజకీయం

అస్తిత్వ పోరాటంలో నుంచి ఎగిసిన ఆత్మగౌరవ పతాకం తెలంగాణ. అరవై ఏండ్ల సమైక్య ఆధిపత్య పాలనపై అలుపెరుగని పోరాటమే తెలంగాణ. స్వాభిమాన, సార్వభౌమాధికార శిఖరమే తెలంగాణ. అలాంటి తెలంగాణ అస్తిత్వంపై ఎనిమిది నెలల కాలంలోనే మరోసారి నీడలు పరచుకుంటున్నాయి. గత ఎన్నికలకు ముందు మాజీ సీఎం కేసీఆర్ హెచ్చరించినట్టుగానే ఢిల్లీ ఆధిపత్యం మళ్లీ జడలు విప్పుతున్నది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టే బానిసబుద్ధులు 'జీ హుజూర్ జో హుకుం' అంటూ మోకరిల్లుతున్నారు. ఇక్కడి ప్రజల ఆదర్శాలకు, ఆశయాలకు గండికొడుతున్నారు. ఇక్కడి ప్రతీకలను వెనుకతట్టు పట్టిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేందుకు వారికి చేతులు రాకపోవడమే అందుకు అతిపెద్ద నిదర్శనం. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టేందుకు ఉరుకులాడటం వైపరీత్యం. దేశానికి ప్రధానులుగా చేసిన అనేకమందిలో రాజీవ్ ఒకరు. దేశంలో ఆధునిక సాంకేతికత ప్రవేశపెట్టేందుకు పాటుపడిన నేతగా ఆయనను గుర్తుంచుకోవాల్సిందే, గౌరవించుకోవాల్సిందే. దేశం కోసం సర్వోన్నత త్యాగం చేసిన నేతగా ఆయనను స్మరించుకోవాల్సిందే. ఎవరూ కాదనరు. అయినా ఇక్కడ ఆయనకు ఏం తక్కువైందని? రాజీవ్ రహదారి లేదా? రాజీవ్ స్టేడియం లేదా? రాజీవ్ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా? ఊరూరా విగ్రహాలు ఉండనే ఉన్నాయి. నగరం నడిబొడ్డున పంజాగుట్టలో రాజీవ్ విగ్రహం ఉంది. అయినా ప్రాపకం కోసం వెంపర్లాట తప్పిస్తే కొత్తగా రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది?

వెన్నెముక లేని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు పదవుల కోసం ఢిల్లీ ముందు మోకరిల్లడం నాటి నుంచీ అలవాటే. ఆ అలవాటులో భాగంగా జరుగుతున్నదే రాజీవ్ విగ్రహ ఏర్పాటు హంగామా. అందుకు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్న చోటునే ఎంచుకోవడం వారిలో ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం లోపించడాన్ని వేలెత్తి చూపుతున్నది. ఇక్కడి ఆకాంక్షల్ని ప్రతిఫలించే విగ్రహాలు పెట్టాల్సిన అవసరం లేదా? ఇక్కడి ప్రతీకల్ని నిలుపుకోవాలన్న సోయి ఉండొద్దా? తెలంగాణ అస్తిత్వంతో రాజీవ్‌కు ఏమైనా సంబంధం ఉందా? తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షతో కాంగ్రెస్ ఆటలాడిన చరిత్ర మరిచిపోలేం కదా. దేశాన్ని ఆర్థిక సుడిగుండం నుంచి బయటపడేసి మహోన్నత ప్రధానిగా మన్ననలందుకున్న ఈ గడ్డ ముద్దుబిడ్డ పీవీకి కాంగ్రెస్ చేసిన అవమానాలు కడిగితే పోయేవి కావు. అన్నీ మరిచిపోయి రాజీవ్ విగ్రహాలు పెడుతూ పోతే సరిపోతుందా? బీఆర్ఎస్ హయాంలో విమానాశ్రయానికి రాజీవ్ పేరు తొలగించి, తెలంగాణ అస్తిత్వంతో సంబంధమున్న వ్యక్తి పేరు పెట్టాలనే డిమాండ్లు బలంగా వినిపించాయి. అయినా అప్పటి నాయకత్వం సంయమనంతో, పరిణతితో వ్యవహరించి అందుకు పూనుకోలేదు. రేపు ప్రజల ఒత్తిడి ఎక్కువైతే పూనుకోదని మాత్రం చెప్పలేం. ఢిల్లీ పార్టీకి అధిష్ఠానమే సర్వోన్నతం. కానీ, బీఆర్ఎస్‌కు ప్రాంతీయ అస్తిత్వమే సర్వస్వం.

తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమై నూతన సచివాలయ భవనం వెలిసింది. ఆ భవనం ముందర తెలంగాణ తల్లి విగ్రహం ఉండటమే ఉచితం. కొందరు మిడిమిడి జ్ఞానులు తెలంగాణ తల్లి భావనపై, రూపురేఖలపై ప్రశ్నలు లేవనెత్తి గందరగోళపర్చాలని చూస్తున్నారు. తెలంగాణ తల్లి భావన ఈనాటిది కాదు. దాశరథి, రావెళ్ల రామారావు వంటి కవులు ఆనాడే తెలంగాణ తల్లి అంటూ పద్యాలు రాశారు. తెలంగాణ మలిదశ ఉద్యమ స్ఫూర్తిలో నుంచి ఆవిష్కృతమైన తెలంగాణ తల్లి విగ్రహాలు ఈనాడు చాలా ఊళ్లలో కనిపిస్తున్నాయి. ఆ విగ్రహ రూపురేఖలపై సర్వత్రా ఆమోదం వ్యక్తమైంది. అదే నికరమైంది. సమైక్య పాలకులు తమ ఆధిపత్యాన్ని స్థిరీకరించుకునేందుకు ముందుకుతెచ్చిన తెలుగు తల్లి భావన ఇక్కడ ఎవరికీ పెద్దగా ఎక్కలేదు. ఇక్కడి ప్రజల మనసుల్లో తెలంగాణ తల్లి తప్ప మరొకటి లేదు. రాజీవ్ విగ్రహం ఆలోచన మానుకుని తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెలంగాణ సచివాలయం ముందు నెలకొల్పాలని కోరుతూ ఇక్కడి విద్యావంతులు కాంగ్రెస్ అధిష్ఠానానికి బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. ప్రజల ఆకాంక్షలు, ఆశలను సోనియా, రాహుల్ కాదంటారా? రాజీవ్ పేరును కాంగ్రెస్ నేతలు అత్యుత్సాహంతో రగడలోకి లాగడాన్ని వారు సమర్థిస్తారా?

కాంగ్రెస్‌కు ప్రజలు ఒకవిడత అధికారం మాత్రమే ఇచ్చారు. రాష్ట్రాన్ని రాసివ్వలేదు. తెలంగాణ చైతన్యశీలమైన గడ్డ. కాంగ్రెస్ నాయకుల బానిస మనస్తత్వాన్ని ఇక్కడి ప్రజలు ఏ మాత్రం సహించరు. ఇది కాంగ్రెస్ పాలకులు ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన సత్యం. మీ పదవులను పదిలం చేసుకునేందుకు మీరు రాజీవ్ నామజపం చేస్తున్నారేమో. అధినేత్రి సోనియాను ప్రసన్నం చేసుకునేందుకు అదొక తాయెత్తులా పనిచేస్తుందనే చౌకబారు ఆలోచన తప్పితే ఇందులో మరేమైనా ఉందా? మీరు రాజీవ్‌ను గౌరవిస్తున్నామని అనుకుంటున్నారేమో. కానీ, ప్రజల దృష్టిలో చులకన చేస్తున్నామని గుర్తించడం లేదు. ఉదాత్త ఆశయాలు, ఆధునిక భావజాలమున్న రాజీవ్ గనుక బతికుంటే ఈ తరహా వ్యక్తి ఆరాధనను సహించేవారా అని కూడా కాంగ్రెస్ నేతలు ఆలోచించడం లేదు. తెలంగాణ పోరుగడ్డ. తలవంచని వీరుల గడ్డ. ఇక్కడ గడీలు కూల్చినై, అహంకారాలు నేలవాల్చినై. ప్రజలు కన్నెర్రజేస్తే 'సహేంద్ర తక్షకాయ స్వాహా' అన్నట్టుగా మీరు, మీ అధికారం, మీ విగ్రహాలు అన్నీ కుప్పకూలకతప్పదు.



ఆర్థిక అసమానతలు తీవ్రతరం!

మన దేశంలో నిరుద్యోగ సమస్య మాత్రమే కాదు, ధనికులు-పేదల మధ్య అంతరం కూడా మరింతగా పెరుగుతున్నది. అసాధారణ సంపద పంపిణీ.. ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేసిందని దానర్థం. ఈ పరిస్థితి ప్రజలతో పాటు దేశ ప్రయోజనాలను ప్రభావితం చేస్తున్నది. ఇది ఆందోళన కలిగించే అంశం.

- మాయావతి, యూపీ మాజీ ముఖ్యమంత్రి

మళ్లీ అస్తిత్వ పోరు.. తప్పదు జనహోరు!

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయినప్పటికీ తెలంగాణ అస్తిత్వ పోరాటం మళ్లీ మొదటికే వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువైన వెంటనే తెలంగాణ అస్తిత్వ ప్రతీకలపై దాడి మొదలైంది. తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక వారసత్వ చిహ్నాలపై విషం చిమ్మడం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన కాకతీయ కళాతోరణం కళాత్మకతను కప్పిపెట్టే ప్రయత్నం జరిగింది. ఆరోగ్య, సౌభాగ్య హైదరాబాద్‌ను కాంక్షిస్తూ నిర్మించిన ఆధునిక మానవ జీవనాభివృద్ధి, నగర నిర్మాణస్ఫూర్తి చిహ్నం చార్మినార్ రాచరికపు చిహ్నం స్థాయికి పడిపోయి అవమానపడింది.

ఎర్రోజు శ్రీనివాస్
97003 02973

అవమానాల వరుసలో ఇప్పుడు తెలంగాణ తల్లి వంతు వచ్చింది. మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రత్యామ్నాయ అస్తిత్వ ప్రతీకలను ముందుపెట్టుకొని సాగింది. తెలంగాణ కున్న ప్రత్యామ్నాయ సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని పునర్నిర్వచించుకున్నది. ఆ సాంస్కృతిక పునర్నిర్మాణ పరంపరలో తెలంగాణ తల్లి ఆవిర్భవించింది. ఉమ్మడి ఏపీలో తెలుగు తల్లికి ప్రత్యామ్నాయంగా తెలంగాణ ప్రజలు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించుకున్నారు. ఊరూరా, వాడవాడలా తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. 2003లో మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నప్పటి నుంచి ఇక్కడి ప్రజల ఆకాంక్ష అంతా స్వరాష్ట్ర సాధన చుట్టే తిరిగింది. సచివాలయంలో తెలంగాణ వాళ్లుండాలి, సచివాలయం తెలంగాణ తల్లిని గౌరవించాలి. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు నిలబెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు సంతోషించారు. మన స్వీయ అస్తిత్వానికి, స్వయంపాలనకు తెలంగాణ తల్లి విగ్రహం ప్రతీకగా నిలుస్తుందని సంతోషించారు, ఆహ్వానించారు. కానీ, ప్రభుత్వం మారగానే తెలంగాణ అస్తిత్వంపై దాడి మళ్లీ మొదలైంది. తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరించే పనిలోపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు మారడం సహజం. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పరిపాలన చేయాలి. కానీ, అస్తిత్వాన్ని దెబ్బతీస్తామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు.

> **తెలంగాణపైనే ఎందుకింత కక్ష? కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఇతర రాష్ట్రాల్లో వారి స్థానిక అస్తిత్వాలను వదులుకుంటున్నారా? మన రాష్ట్రంలోనే ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణం ఈ రాజకీయ నాయకత్వం వెనుక ఆంధ్రా నాయకత్వ లాబీ పనిచేస్తున్నదనటంలో ఎటువంటి సందేహం లేదు.**

తెలంగాణ తల్లికి రాజీవ్‌గాంధీ ప్రత్యామ్నాయం కాగలరని కాంగ్రెస్ వారు భావిస్తున్నారా? అయితే, భరతమాతకు బదులుగా వేరే రాజకీయ నాయకులను ప్రత్యామ్నాయంగా చూపే సాహసం చేస్తారా? గతంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే ప్రదేశాన్ని రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడానికి ఎంపిక చేయడంతో ఈ ప్రభుత్వ దుర్బుద్ధి బహిర్గతమైంది. తెలంగాణ అస్తిత్వంతో ఈ ప్రభుత్వం పనిచేయడం లేదని అర్థమవుతున్నది. తెలంగాణపైనే ఎందుకింత కక్ష? కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఇతర రాష్ట్రాల్లో వారి స్థానిక అస్తిత్వాలను వదులుకుంటున్నారా? మన రాష్ట్రంలోనే ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణం ఈ రాజకీయ నాయకత్వం వెనుక ఆంధ్రా నాయకత్వ లాబీ పనిచేస్తున్నదనటంలో ఎటువంటి సందేహం లేదు. రాజకీయ నాయకత్వం రూపంలో తెలంగాణతనం సారంలో ఆంధ్రా తత్వం కురిపిస్తున్నది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనుకున్న ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకోవడం గర్హనీయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలతో రాజకీయం చేయాలని చూసిన ఆంధ్రా నాయకత్వాన్ని మన రాష్ట్రం నుంచి తరిమికొట్టాం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా మన ప్రాంత రాజకీయ నాయకులు మన అస్తిత్వాలను, మన సోయిని కలిగి లేరు. తెలంగాణ ప్రజల కరుణతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు మరెవరికో ఊడిగం చేయడానికి తెలంగాణ తల్లిని అవమానించాలని చూస్తున్నారు. తమకు అధికారాన్ని అప్పగించిన ప్రజల ఆకాంక్షలు చూసేవారు ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల పోరాటాన్ని మననం చేసుకోవాల్సిందిగా కోరుతున్నా.

> **సంచలనాల కోసం, వివాదాల కోసం ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ అస్తిత్వంతో ఆడుకునే ప్రయత్నం చేయకూడదు. మాట, యాసలోనే తెలంగాణ, ఆలోచనలన్నీ ఆంధ్రాలో అన్నట్టున్నది పరిస్థితి. విశ్వనగరంలా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరాన్ని చూసి ఇతర ప్రాంతాలవారు ఇలాంటి నగరాన్ని నిర్మించుకోవాలని ఆశపడుతుంటే, ఇక్కడ అమరావతి లాంటి నగరాన్ని నిర్మిస్తామని ప్రకటించడం ద్వారా వారి మెదడు ఆలోచనలు ఎవరి స్వాధీనంలో, అధీనంలో ఉన్నాయో అర్థం అవుతున్నది.**

తెలంగాణ తల్లి భావన తిరిగి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పునర్జీవం పొందింది. అందుకే తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పాల్సినచోట రాజీవ్ విగ్రహాన్ని పెట్టడం ద్వారా అధిష్ఠానం మెప్పు పొందుతారేమో.. కానీ, ప్రజల్లో ఉన్న పతారా మాత్రం పోగొట్టుకోవడం ఖాయం. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేచోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెడతామని.. ఎవరినీ సంప్రదించకుండా, ఎవరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. ఇది తెలంగాణ తల్లిని అవమానించడమే. ఇది ఇక్కడితో ఆగిపోదు. ప్రజల మనోభావాలను, ఆకాంక్షలను దెబ్బతీస్తే.. స్వీయ అస్తిత్వ ఆకాంక్షల పరిరక్షణకు ప్రజల ప్రతిస్పందనను ముందే ఊహించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. ఉద్యమ సమయంలో ప్రజలు తమ నేమ్ ప్లేట్ల మీద, వెహికల్ నంబర్ ప్లేట్ల మీద స్వచ్ఛందంగా 'టీజే' అని రాసుకొని ఏపీ ఆనవాళ్లను చెరిపేసిన ఘటనలు ఈ ప్రభుత్వంలో ఉన్న వారికి ఇంకా గుర్తుండే ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లోకి తెలంగాణ ప్రజలను నెట్టే కార్యక్రమాలేవీ చేయకపోవడం మంచిది.

సంఖ్యా బలం ఉన్నదని అస్తిత్వాలను కూలగొడదామంటే కుదరదు. సంఖ్యాబలాలు శాశ్వతం కావు. అవి ఐదేండ్లకోసారి మారేవే. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఏం చేసినా సంఖ్యా బలాలు తారుమారైపోతాయి. నా తెలంగాణ తల్లి పుణ్య కంజాతవల్లి. తెలంగాణ అస్తిత్వం ముందు ఏదీ నిలబడదు. తెలంగాణ తల్లికి మరో ప్రత్యామ్నాయం లేదు.

(వ్యాసకర్త: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ వికాస సమితి)

కశ్మీరీలను గెలవడం పార్టీలకు పరీక్షే!

విభిన్న జాతులు, మతాలు, భాషలు, నైసర్గిక స్వరూపాలు కలిగిన ప్రాంతాల సమాహారం జమ్మూకశ్మీర్. నిత్యం వార్తల్లో ఉండే ఈ ప్రాంతంలో పదేండ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిషన్ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టికల్ 370 రద్దుతో కేంద్రపాలిత ప్రాంతంగా మారిన కశ్మీర్‌లో జరగనున్న ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ చరిత్రలోనే ప్రత్యేకమైనవి. ఈ నేపథ్యంలో 'పీపుల్స్ పల్స్' బృందం కశ్మీరు లోయ నుంచి జమ్మూ మైదాన ప్రాంతాల వరకు.. ఎందరో సామాన్య కశ్మీరీలతో మాట్లాడి, వారి మనసులో ఏముందో పసిగట్టే ప్రయత్నం చేసింది.

దిలీప్ రెడ్డి
99490 99802

1977లో మొరార్జీదేశాయ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక జరిగిన అసెంబ్లీ ఎన్నిక లొక్కటే.. 78 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో స్వేచ్ఛగా, న్యాయంగా జరిగిన ఎన్నిక లని కశ్మీరీలు అంటుంటారు. అంతకు ముందు, ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ ఢిల్లీ పాలకులకు అనుకూలంగా జరిగిన ఎన్నికలేన నేది వారి భావన. అక్కడి ప్రజలకు స్థానిక సమస్యల పరిష్కారం పట్ల ఏకాభిప్రాయం లేనప్పటికీ.. లెఫ్టినెంట్ గవర్నర్ పాలన పోయి, తాము ఎన్నుకున్న ప్రభుత్వం రావాలనే విషయంలో మాత్రం ఏకాభిప్రాయం ఉన్నది.

ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 2023 డిసెంబరు 11న సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే, రాష్ట్ర హోదాను పునరుద్ధరించి, సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అక్కడివారితో ముచ్చటించగా.. 'సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. మహా అయితే ఢిల్లీ లాంటి ప్రభుత్వం ఏర్పడవచ్చు. అక్కడ అన్ని కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అలాంటి ప్రభుత్వం మాకొద్దు' అని ఒక వ్యాపారి అభిప్రాయపడ్డారు. ఇలాంటి అభిప్రాయమే చాలాచోట్ల వినపడింది. కేంద్రపాలిత ప్రాంతాలుగా కాకుండా.. రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఇటు కశ్మీర్, అటు లఢఖ్ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

> **గతంలో బీజేపీకి ఓటేసినవాళ్లు కూడా రాష్ట్ర హోదా-పాలన విషయంలో ఢిల్లీ మోడల్‌ను వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్న గుజ్జర్ సామాజికవర్గం ఇప్పుడు ఆ పార్టీకి దూరమైంది. స్థానిక బీజేపీ నాయకులు కూడా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని, ఢిల్లీ తరహా ప్రభుత్వం వద్దని చెప్తున్నారు. కశ్మీర్ విషయంలో తమది చారిత్రాత్మక నిర్ణయమని దేశవ్యాప్తంగా బీజేపీ ప్రచారం చేసుకుంటుండగా.. ఆ నిర్ణయం సరైనదేనని కశ్మీర్ బీజేపీ నాయకులు ధైర్యంగా చెప్పలేకపోతున్నారు.**

కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వంలో కొన్ని లోపాలు, వైఫల్యాలు ఉంటాయి. కానీ, మిలిటరీ సాయంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఎల్జీ పాలన కంటే అది మెరుగ్గానే ఉంటుందని అక్కడి ప్రజలు భావిస్తున్నారు. 'ఎల్జీకి, ప్రజలకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఎన్నికలతో సంబంధం లేకుండా వచ్చిన ఎల్జీ, అతని బ్యూరోక్రాట్ల బృందం నుంచి ప్రజాస్వామిక పాలనను ఆశించలేం' అని జమ్మూ యూనివర్సిటీకి చెందిన ఓ ప్రొఫెసర్ అన్నారు. 'ప్రజల అంచనాలకు తగ్గట్టుగా నాయకులు పని చేయకపోతే, వచ్చే ఎన్నికల్లో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అది దృష్టిలో ఉంచుకొనైనా వారు ప్రజల కోసం పనిచేస్తారు. కానీ, ఎల్జీ, బ్యూరోక్రాట్లకు ఆ ప్రమాదం లేదు' అని శ్రీనగర్‌లో కలిసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అభిప్రాయపడ్డారు.

> **రాజకీయ పార్టీల పట్ల కశ్మీరీల దృక్పథం మారిందని ఇటీవలి లోక్‌సభ ఎన్నికలు నిరూపించాయి. కశ్మీర్ ప్రాంతంలో అశాంతికి, తీవ్రవాదానికి, మత కలహాలకు చోటులేదని సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ శాతం అన్ని రాజకీయ పార్టీలకు సానుకూల సంకేతాలు పంపించింది.**

వేర్పాటువాదాన్ని, తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదనే ఆరోపణలపై జమాతె ఇస్లామీ సంస్థను నిషేధించిన ఎన్డీయే ప్రభుత్వమే.. ఆ నిషేధాన్ని ఎత్తివేయడంపై ప్రజల్లో భిన్నమైన సంకేతాలు వెళ్తున్నాయి. సంప్రదాయ నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీలకు జమాతె ఇస్లామీ ప్రత్యామ్నాయంగా మారే అవకాశాలను కశ్మీరీలు కొట్టిపారేయడం లేదు.

లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్‌లో అభ్యర్థిని నిలబెట్టకుండా జమ్మూలో బీజేపీ తన బలాన్ని పరిరక్షించుకుంది. ఈ అసెంబ్లీ ఎన్నికలను ఆ పార్టీ ఒక ప్రయోగంగా చూస్తున్నట్టు అనిపిస్తున్నది. ఎలాంటి ఫలితాలు వచ్చినా ఫర్వాలేదన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తున్నది. మరోవైపు బీజేపీని ఆకాశానికెత్తేందుకు మీడియాలో చూపించే పంతెనలు, అండర్‌పాస్‌లను పక్కనపెడితే.. స్థానిక ప్రాంతాలను కలిపే రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. మొత్తంగా 2019కి ముందే బాగుండేదని స్థానికులంటున్నారు.

జమ్మూ, శ్రీనగర్.. పేరుకే స్మార్ట్ సిటీలని, కనీస మౌలిక వసతులు లేక తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు వాపోతున్నారు. బయటి నుంచి వచ్చిన వ్యాపారులు అక్రమ మైనింగ్ చేస్తున్నారని, మద్యం వ్యాపారం చేస్తున్నారని, ముఖ్యమైన పదవుల్లో స్థానికేతర అధికారులే ఉంటున్నారని, దానివల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని అందరూ ముక్తకంఠంతో చెప్పున్నారు. 'ఐఐఎం, ఐఐటీల్లో కూడా ముఖ్యమైన పదవుల్లో బయటివాళ్లనే ఎందుకు నియమిస్తున్నారు? ఎందుకంత భయం?' అని అడ్వకేట్ షేక్ షకీల్ ప్రశ్నించారు.

ఉద్యోగావకాశాలు సన్నగిల్లడం, బయటి వాళ్లు అక్కడి వ్యాపారాలు, సంస్థలను నియంత్రించడం పట్ల కశ్మీరీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇవన్నీ బీజేపీకి నష్టం చేసేవే. 'మాకు ఉద్యోగాల్లేవు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహుల కింద మాపై నేరం మోపుతున్నారు' అని కశ్మీరీ యువత అభిప్రాయపడుతున్నది.

అనవసర ఖర్చు అవుతున్నదని చలికాలంలో జమ్మూ, వేసవిలో శ్రీనగర్ నుంచి జరిగే దర్బార్ పాలనకు 2019లో ఎన్డీయే ప్రభుత్వం చెక్‌పెట్టింది. కానీ, దర్బార్ ఉన్నప్పుడు అధికారులు, వాళ్ల కుటుంబాలు ఇక్కడే బస చేసేవని, వారు ఐదారు నెలల పాటు చేసే ఖర్చే తమ ఆదాయమని జమ్మూకు చెందిన వ్యాపారి వికాస్‌శర్మ చెప్పారు. అంతేకాదు, అమర్‌నాథ్, మాత వైష్ణో దేవి యాత్రికులు గతంలో జమ్మూలో బాస్మతి బియ్యం, రాజ్మా, బాదం, కుంకుమ, దుస్తులు కొనుగోలు చేసే వారు. ఇప్పుడు కత్రాకు రోడ్డు, రైలు మార్గాలు విస్తరించడంతో జమ్మూలో యాత్రికులు ఆగడం లేదు. ఇది కూడా జమ్మూలో ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. ఇలా తమ ప్రాంతంలోని అనేక సమస్యలు పరిష్కారం కావాలని కశ్మీరీలు కోరుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో 1990లో చెల్లాచెదురైన కశ్మీరీ పండిట్లకు ఎలాంటి భరోసా కల్పిస్తారు? నిరుద్యోగ సమస్యను ఎలా రూపుమాపుతారు? అభివృద్ధి, సంక్షేమాన్ని ఎలా అందిస్తారు? శాంతిని ఎలా నెలకొల్పుతారు? లాంటి అనేక ప్రశ్నలకు రాజకీయ పార్టీలు, నాయకులు సమాధానం చెప్పాల్సి ఉంది. ఆ సమాధానాల ఆధారంగా ఓటేసి తమ భవిత వ్యాన్ని రూపొందించుకోవాలని కశ్మీరీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకుడు, పీపుల్స్ పల్స్ రిసెర్చ్ సంస్థ)

'నాకు రుణమాఫీ గాలె'

ఇప్పుడు రాష్ట్రంల 'నాకు రుణమాఫీ గాలె' కాలం నడుస్తున్నది. 'నీ క్రాప్ లోన్ మాఫైందా?' అన్న ప్రశ్నలకు 'నాదింకా మాఫీ గాలె' అన్న జవాబులే ఎక్కువగా ఇనవడ్తున్నయి. 'రైతులందరికీ రుణమాఫీ జేసినమని కాంగ్రెస్ సర్కార్ గొప్పలు చెప్పుకుంటుంటే.. నువ్విట్లా రాస్తున్నవేంద'ని మీకు డౌట్ గొట్టొచ్చు, తప్పు లేదు. కానీ, ఓ పవోజనంల పది మంది బంతి మీద గూసున్నప్పుడు ఒక్కతనికి గంటెడు తున్కలేసి, తతిమా తొమ్మిది మందికి ఉత్త శోర్వా వోసి సాలిచ్చుకుంటే.. అక్కడున్నోళ్లందరికీ కడుపు నిండా తిండి వెట్టినట్టు కాదు. ఆ తున్కలు వడ్డాయన తిట్టకపోవచ్చు కానీ, తతిమా తొమ్మిది మంది మాత్రం.. 'వీనికి ఎల్ల కుంటె యాటలు కోసి పవోజనం ఎవ్వడు చెయ్యి మన్నడు. కూరగాయలతోని పవోజనం జేసి అందరికీ కడుపు నిండా తిండివెడ్తే ఎవ్వడన్న కొడ్తుండెనా?' అని బండు బండు కడ్తుతరు. ఆ తిట్లకు గంటెడు తున్కలు తిన్న మనిషికి గూడ మనసున వట్టది. అచ్చం రుణమాఫీ ముచ్చట గూడ అసొంటిదే. పదిమందిల ఎవ్వలికో ఒగలికి రుణమాఫీ అయితే.. రైతులందరికీ రుణ మాఫీ అయినట్టు ఎట్లయితది? అస్సల్కే గాదు.

గడ్డం సతీష్
99590 59041

***

మస్తు రోజుల తర్వాత నా దోస్తు ఒకతను మస్కట్ నుంచి తెలంగాణకొచ్చిండు. నలభై రోజుల చుట్టీ మీదొచ్చిన అతను మళ్లా మస్కట్ వోతడనంగా ముఖ్యమంత్రి నోట్లెకెళ్లి 'రుణమాఫీ' ముచ్చట బైటికెళ్లింది. ఆ ముచ్చటిన్న నా దోస్తు.. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చే భూమిని తన పేరు మీన జేస్కుందామని మస్కట్ పోవుడు వాయిదా ఏస్కున్నడు. నా దోస్తు వాళ్ల బాపు పేరు రాములు. ఆయనగూడ వలస జీవే. ఓ పది హేనేండ్ల పాటు మస్కట్‌ల ఉండి ఐదారేండ్ల కిందనే సొంతూరికొచ్చిండు. పుష్కలంగా ఉన్న సాగునీటిని జూసిన రాములు 'నేనిగ మళ్లా మస్కట్ వోను, ఇక్కన్నే ఎవుసం జేస్కుంట'నని ఒక్కశిత్తం జేస్కున్నడు. లాగోడి కోసం తన భూమి కాయిదాలను బేంకుల కుదవెట్టి మరీ లక్షా నలభై వేల రూపాల క్రాప్‌లోన్ దీస్కున్నడు. పుట్టినూళ్లనే మళ్లా ఎవుసం షురూ జేసిండు. రెండు పస్లల పంట దీసిండో, లేదో పాపం పానం మంచిగలేక రాములు కాలంజేసిండు. ఆయ్ననే కాలం జేసిండంటే ఇగ క్రాప్‌లోన్ ఎవర